క్లుప్తంగా

గోదావరి మాతకు పున్నమి హారతి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలోని గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శోభకృత్ నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సాయంకాలం ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణశర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రమాణ స్వీకారం వాయిదా

అంబాజీపేట: ఇటీవల నియమితులైన బ్రాహ్మణ కార్పొరేషన్ సంక్షేమ చైర్మన్‌గా ఈ నెల 31న నిర్వహించాల్సిన ప్రమాణ స్వీకారోత్సవాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు పీకే రావు తెలిపారు. తిరిగి ప్రమాణ స్వీకారోత్సవం ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు.

ఆర్థిక సాయం పంపిణీ



గుడిమూలలో రూపాస్‌కు ఆర్థిక సాయం చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: మండలంలోని గుడిమూల, గొంది గ్రామాల్లో వేర్వేరు కారణాల రీత్యా బాధపడుతున్న ఇరువురు రోగులకు వైఎస్సార్ సీపీ ఖతార్ కన్వీనర్, రామేశ్వరానికి చెందిన దొండపాటి శశికిరణ్ ఆర్థిక సాయం శనివారం పంపిణీ చేశారు. ఈ మేరకు ఆ దేశం నుంచి పంపిన మొత్తం రూ.10,000ను బాధితులకు రూ.5 వేలు చొప్పున ఆయన తల్లి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ అందజేశారు. గుడిమూలకు చెందిన గేదెల రూపాస్, గొందికి చెందిన తిరుమాని వెంకటరమణకు పై సాయాన్ని అందజేశారు. వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన రాజా, సర్పంచ్‌లు దెందుకూరి శ్రీహరిరాజు, దొండపాటి రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వాల్మీకి మహర్షికి ఘనంగా నివాళి



మామిడికుదురులో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ మొహిద్దీన్

మామిడికుదురు: రామాయణం రచయిత వాల్మీకి మహర్షి జయంతిని శనివారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. రామాయణంలో వాల్మీకి మహర్షి శ్రీరాముని జీవిత చరిత్రను అద్భుతంగా వివరించారన్నారు. కార్యక్రమంలో అప్పన రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ సాహితీ సమితి చైర్మన్ నేలపూడి రామకృష్ణ అధ్యక్షతన వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీఓ ఎం.భారతి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మండల పరిషత్ ఏఓ వీఎస్‌వీ శర్మ, సీనియర్ అసిస్టెంట్ కె.జయలలిత, జూనియర్ అసిస్టెంట్ ఆర్.రామకృష్ణ, ఏపీఓ బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

రాజోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన అధ్యాపకులతో పాటు ఇటీవల డాక్టరేట్ పొందిన హిందీ అధ్యాపకుడు పి.కుమారరాజును విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

భేతాళుని ఉత్సవం.. మదినిండా పరవశం

- 13 వాహనాలతో భక్తులకు కనువిందు
- నేడే భేతాళ వాహన మహోత్సవం
- నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం



గంగలకుర్రు మలుపు వాహన గణపతి (ఫైల్)

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా జరిపే విజయ భేతాళ స్వామి వాహన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. రంగూన్, మయన్మార్ (బర్మా)ల్లో భేతాళ ఉత్సవాలు జరుగుతాయి. పూర్వం కొందరు కూలి పనులకు అంబాజీపేట, పేరూరుకు చెందిన ప్రజలు రంగూన్ తదితర ప్రాంతాలకు వెళ్లినప్పుడు భేతాళ ఉత్సవాలను నిర్వహించడం గమనించారు. 13 వాహనాలతో భక్తులకు కనువిందు ఉత్సవం నిర్వహించడం, పూజించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్నట్లు గమనించారు. విదేశాలకు వలస వెళ్లిన వారు తిరిగి స్వదేశానికి వచ్చిన తరువాత వారు కూడా స్థానికంగా భేతాళ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 1967లో శెట్టిబలిజ అభ్యుదయ సంఘ ఆధ్వర్యంలో ప్రారంభించిన భేతాళ ఉత్సవాలు నాలుగు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతూ వస్తోంది. ఈ భేతాళ ఉత్సవాలను 1981లో అంబాజీపేట పెద్ద వీధి శివారు శ్రీనివాస్‌నగర్ విజయ భేతాళ స్వామి ఆలయాన్ని నిర్మించి దొమ్మేటి శ్రీరాములు, పితాని నాగిశెట్టి, శీలం వెంకట్రావుల ఆధ్వర్యంలో విస్తరించారు. ఈ ఉత్సవానికి 13 ప్రాంతాల నుంచి తరలి వచ్చే వాహనాలు అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో కొలువు తీరడం, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చడం, చేడీ తాలింకానాలు ఈ ఉత్సవానికి ప్రత్యేకత సంతరించిపెడుతోంది. పెద్దవీధి, బస్టాండ్ రోడ్డు, గన్నవరం రోడ్డు, అమలాపురం రోడ్లలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో తెల్లవార్లు ఆద్యంతం భేతాళ స్వామి వాహనాల మహోత్సవం కనువిందు చేయనుంది.

కొలువుతీరే వాహనాలివే..

శ్రీనివాస్‌నగర్ నుంచి గరుత్మంతుడు, పెచ్చెట్టివారిపాలెం నుంచి గరుత్మంతుడు, మాచవరం శ్రీరామ్‌నగర్ నుంచి సింహం వాహనం, దొమ్మేటివారిపాలెం శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారిపాలెం ఆంజనేయస్వామి, పోతాయిలంక ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు విజయ గణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి నుంచి హంస వాహనం, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుంచి షిరిడిసాయిబాబా, గుత్తులవారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరిదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటాయి.



శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయ భేతాళ స్వామి

భేతాళ ఉత్సవాన్ని సంప్రదాయంగా జరుపుకోవాలి

విజయ భేతాళ స్వామి ఉత్సవాన్ని ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సంప్రదాయబద్ధంగా జరుపుకొనేలా అందరూ సహకరించుకోవాలని సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ఆదివారం జరిగే భేతాళ ఉత్సవానికి సంబంధించి భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. 130 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 8 మంది ఎస్సైలు, 20 మంది ఏఎస్సైలతో పాటు 3 మొబైల్ పార్టీలు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. బాడీవాన్, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వాహన మహోత్సవం సందర్భంగా సెంటర్ అంతా రద్దీగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్ట్ చేస్తున్నామని అందుకు వాహనదారులు సహకరించాలని సీఐ, ఎస్సైలు కోరారు.

కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సుబ్బారావు

మామిడికుదురు: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అప్పనపల్లికి చెందిన కంకిపాటి సుబ్బారావును నియమించారు. ఆయన గతంలో జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా, మండల ప్రధాన కార్యదర్శిగా, మండల శాఖ అధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా పని చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సుబ్బారావును నియమించడంపై ఆ పార్టీ నేతలు మెండా ఆదినారాయణతో పాటు పలువురు పార్టీ నేతలు అభినందించారు. తన నియామకానికి కారకులైన పార్టీ నేతలకు సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

భారీ వర్షం... స్తంభించిన జన జీవనం



అంబాజీపేటలో కురుస్తున్న భారీ వర్షం

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా శనివారం అంబాజీపేట మండలంలో భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఎడతెరిపి లేని వర్షంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాల్లోను, రహదారుల్లో వర్షపు నీరు కాలువలను తలపించింది. వర్షం కారణంగా ఆరుబయట చిరు వ్యాపారాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు, వ్యాపారులు వర్షంలో తడిచి ముద్దయ్యారు.

అందరూ బాగుండాలి.. అదే సీఎం లక్ష్యం

మంత్రి ధర్మాన, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో ప్రజలందరూ బాగుండాలి.. అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని గంటిలో శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పథకాలను మంత్రి ధర్మాన ప్రారంభోత్సవం చేశారు. ఆయన స్థానిక మహిళలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. ఈ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది? నిర్మొహమాటంగా చెప్పండి అని ప్రశ్నించారు. ఓ మహిళ మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయనడంతో విద్యుత్ వినియోగం పెరిగినపుడు బిల్లు కూడా అధికంగానే వస్తుంది కదా అని మంత్రి సమాధానమిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ విధానాలు, నేటి జగన్ ప్రభుత్వ విధానాలు బేరీజు వేసుకుని మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని మంత్రి ప్రసాదరావు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎలా జరుగుతుంది? మంచిదేనా? అందరూ సద్వినియోగం చేసుకోవాలి.. ఆరోగ్యంగా జీవించాలి.. అని ఆకాంక్షించారు.



గంటిలో మంచినీటి కుళాయి ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

మంత్రి, ఎమ్మెల్యేలపై పూలవర్షం

గంటి పల్లిపాలెం గ్రామానికి ఎన్నో ఏళ్ల తరువాత ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషి ఫలితంగా శాశ్వత ప్రాతిపదికన కొంత బీటీ, మరికొంత మేర సీసీ రోడ్డు నిర్మించినందుకు కృతజ్ఞతగా ఆ గ్రామస్తులు శనివారం మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే చిర్లలను గ్రామ ముఖద్వారం నుంచి పూలపై నడిపించి వారిపై పూలవర్షం కురిపించారు. రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా వారిద్దరినీ సత్కరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్ సాగి బంగార్రాజు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, ఎంపీటీసీ ముళ్ల జనార్దన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు తగ్గట్టుగా సీఎం పాలన

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సాగుతోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం అంతర్వేదిపాలెం శివారు అడ్డాలపాలెం చొప్పలవారి గ్రూపులో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై కూడా విశేష స్పందన ప్రజల నుంచి వస్తోందన్నారు.



అడ్డాలపాలెంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, మండల కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు ఈద రవిరెడ్డి, నల్లి సురేంద్రరావు, పార్టీ నాయకులు నల్లి త్రిమూర్తులు, గెద్దం అమ్ములు, మందపాటి సత్యనారాయణ, కొల్లాబత్తుల చిట్టిబాబు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ నిలిపివేయాలి

మలికిపురం: సముద్ర తీరంలో ఏవీఆర్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రైవేట్ కంపెనీ చేపడుతున్న బలవంతపు భూ సేకరణను నిలిపివేయాలని మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. ఆయన స్థానిక బీజేపీ నాయకులతో కలసి కేశనపల్లి, పడమటిపాలెం, శంకరగుప్తం గ్రామాల్లో బాధిత దళిత రైతులను కలసి మాట్లాడారు. మీకు అండగా ఉంటామని ఈ విషయంపై గవర్నర్, రాష్ట్రపతి దృష్టికి తీసుకుని వెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దళిత బాధిత రైతులు ఓగూరి సాయిబాబా, యడ్ల అన్నవరం, సుమలత, బాబూరావు, గెద్దం రామమూర్తి, తాడి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంఘాభివృద్ధికి కృషి చేయాలి

అంబాజీపేట: నూతనంగా నియమితులైన కుమ్మర శాలివాహన సంఘాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య అన్నారు. నూతనంగా ఎంపికైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘ సభ్యులు విజయవాడలో మాజీ ఎమ్మెల్సీని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కార్యవర్గాన్ని వివరించి, సంఘం చేసే కార్యక్రమాలను వివరించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. జిల్లా శాలివాహన సంక్షేమ సంఘ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు, సఖినేటిపల్లి పెద్దిరాజు, పుల్లేటికుర్తి రత్నం, వెల్ల త్రిమూర్తులు, ఆదుర్తి నారాయణమూర్తి, వెల్ల రమేష్, దాలేపర్తి వేమన ప్రసాద్‌లు మాజీ ఎమ్మెల్సీని కలసిన వారిలో ఉన్నారు.



మాజీ ఎమ్మెల్సీ వెంకయ్యను కలసిన శాలివాహన సంఘ నాయకులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అంబాజీపేట: ఖాదీ మహోత్సవంలో భాగంగా జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మండలంలోని విద్యార్థులకు ఖాదీ వాడకం, ప్రాధాన్యతాంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్ తెలిపారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన విద్యార్థులకు పోటీలు జరిపారు. వ్యాసరచనలో సీహెచ్ జాహ్నవిశివదుర్గ (జి.అగ్రహారం), యు.లక్ష్మీప్రియ (గంగలకుర్రు), ఎ.లోహిత (అంబాజీపేట), వక్తృత్వంలో సీహెచ్ విజయలక్ష్మి (జి.అగ్రహారం), ఐ.సలోమి (ముక్కామల), వై.అంజలి (పుల్లేటికుర్రు), ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. క్విజ్‌లో ఎల్.ప్రగతి, ఎ.లహరి, ఎ.లోహితలు ప్రథమ, ఎల్.విజయలక్ష్మి, వై.అంజలి, ఎస్.జితేంద్ర ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

అప్పనపల్లి ఆలయం మూసివేత

మామిడికుదురు: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయాన్ని శనివారం మూసివేశారు. సాయంత్రం అయిదు గంటలకు ఆలయ ప్రధాన ద్వారానికి తాళం వేశారు. తిరిగి ఆదివారం స్వామి వారి ఆలయాన్ని తెరుస్తామని ఆలయ ఈఓ జి.మాధవి తెలిపారు. ఆలయ సంప్రోక్షణ, సేవల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి యథావిధిగా భక్తులకు బాల బాలాజీ స్వామి దర్శనాలను పునరుద్ధరిస్తామన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ అర్చకులు, సిబ్బంది తాత్కాలికంగా మూసివేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం యథావిధిగా దర్శనాలు, పూజలు మొదలవుతాయన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని ప్రసిద్ధ ఆలయాలు చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం మూసివేశారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం సాయంత్రం 7.30 గంటలకు మూసి వేశారు. ఆలయాలను ఆదివారం ఉదయం తెరచి సంప్రోక్షణ నిర్వహించి స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

రావులపాలెం: రోడ్డు భద్రతా అంశాలపై అవగాహనతో మెలిగితేనే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా అధికారి (డీటీఓ) ప్రతాప్ అన్నారు. శనివారం రావులపాలెంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎంవీఐ ఓలేటి శ్రీనివాసు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీటీఓ ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై రోడ్డు భద్రతా అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనంతరం ఎంవీఐ శ్రీనివాసు మాట్లాడుతూ ప్రమాదాల నివారించాలంటే నిబంధనలపై అవగాహన ముఖ్యమని భావించి స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగేలా విద్యార్థులతో రోడ్ సేఫ్టీ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారి ఈ ఆలోచన చేసి జిల్లా కలెక్టర్ అనుమతితో చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 7 నుంచి 10 వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసి, రవాణా శాఖ సమన్వయంతో ప్రధానోపాధ్యాయుడు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో పాఠశాలలోని రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యుల ద్వారా విద్యార్థులందరికీ రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 డి.శ్రీనివాసరాజు, హెచ్‌ఎం ఎం.సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు: నేటి సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్‌కు నాంది పలకాలని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అమర వీరులు చేసిన త్యాగాలను వివరించారు. ప్రతి విద్యార్థిని దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎల్లవేళలా రక్షణ పొందాలని సూచించారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం సందర్శించింది. చివరగా 2014లో న్యాక్ 'బీ' గ్రేడు గుర్తింపు పొందిన ఈ కళాశాల 9 ఏళ్ల అనంతరం ఈ ఏడాది న్యాక్ గ్రేడ్ గుర్తింపుకు సంబంధించి గడచిన 5 విద్యా సంవత్సరాల రిపోర్టును జూన్‌లో సబ్మిట్ చేయగా ఆగస్టులో అనుమతించింది. ఆ మేరకు శుక్రవారం, శనివారం న్యాక్ బృందం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ముత్తుకలింగన్‌కృష్ణన్, సభ్యులు ప్రొఫెసర్ వైహెచ్ నాయక్ వాడి, గిల్సన్ జాన్ కళాశాల పరిసరాలను, మౌలిక వసతులను, బోధన అభ్యసనను, పాలనాపరమైన అంశాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, అధ్యాపకులతో సమీక్షించారు. విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. చివరగా ఈ బృందం పర్యవేక్షక నివేదికకు సంబంధించి రిపోర్టు కాపీని కళాశాల ప్రిన్సిపాల్ పెద్దిరాజుకు అందజేశారు. న్యాక్ బెంగళూరు వారు రెండు వారాల్లో కళాశాలకు గ్రేడ్ ప్రకటిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసారి కళాశాలకు మంచి గ్రేడు వస్తుందని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఐకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఆరోగ్యమే సురక్ష లక్ష్యం



మానేపల్లి సురక్ష శిబిరంలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



రామరాజులంకలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ వెంకట సత్యవాణి



మడికి సురక్ష శిబిరంలో రోగులకు సేవలు అందజేస్తున్న వైద్యులు



గొలకోటివారిపాలెం వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పి.గన్నవరం: ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మానేపల్లి గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. వైద్యాధికారులు వై.శ్రీవల్లి, మౌనిక, వెంకటేష్, కార్తీక్ రెడ్డిల ఆధ్వర్యంలో 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, పార్టీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు, చిట్టూరి రవి, యన్నాబత్తుల నాగభూషణం, కోలా గణపతి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మొగలికుదురు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, క్యాంపునకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమం ప్రజల హితం కోసమే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ కడి అరుణకుమారి, ఎంపీటీసీ కొప్పిశెట్టి దుర్గాపార్వతీదేవి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: మండలంలోని మాచవరం సచివాలయం-2లో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్య రంగంలో మార్పులు తీసుకువచ్చి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ సంక్షేమ చైర్మన్ పీకే రావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీ మట్టా పార్వతి, వాసంశెట్టి చినబాబు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకున్న జనసేన ఎంపీపీ

మలికిపురం: మండలంలోని రామరాజులంక సచివాలయం, యూపీ స్కూల్‌లో శనివారం జగనన్న సురక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.నరసింహారావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో జనసేన ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమె మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం వృద్ధులు, దూర ప్రయాణం లేకుండా గ్రామాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లతో వ్యాధి నిర్ధారణ చేసి వాటికి సంబంధించి ఉచిత మందులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాకర శ్రీనివాస్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతా రాజబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, ఎంపీటీసీ మేడిచర్ల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అముడా చైర్మన్ డేవిడ్‌రాజు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో అముడా చైర్మన్‌తో పాటు ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అవిడి పీహెచ్‌సీ వైద్యులతో పాటు స్పెషలిస్టులు, సిబ్బంది శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడిశెట్టి ఏడుకొండలు, గొలకోటి సూర్యప్రకాష్, సుంకర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంగా సీఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మీ మౌనిక అన్నారు. మడికి గ్రామ సచివాయం-1 పరిధిలో తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీవో కె.జాన్ లింకన్, పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు జరిగింది. కార్యక్రమంలో ప్రత్యేక శస్త్ర చికిత్స వైద్య నిపుణులు పాల్గొని 459 మందికి వైద్య సేవలు అందించారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

పి.గన్నవరం: ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హరికోటి శాస్త్రి సూచించారు. మండలంలోని రాజులపాలెం గ్రామ సచివాలయం వద్ద శనివారం సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెల్ ఫోన్ల వినియోగం, సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు ఎవ్వరికీ ఇవ్వకూడదని, వన్‌టైం పాస్‌వర్డ్‌లు చెప్పకూడదని ఆయన వివరించారు. నగరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుత్తుల మధుసూదనరావు, మహిళా పోలీస్ టి.విజయలక్ష్మి, నాయకులు చిన్నం నాగేశ్వరరావు, గంటి సుబ్బు, నెల్లి నాని తదితరులు పాల్గొన్నారు.